
క్లుప్తంగా

బీబీఏ ఉపాధ్యక్షుడిగా పిల్లా శ్రీనివాసరావు



విజయవాడలీగల్: బీబీఏ ఉపాధ్యక్షుడిగా పిల్లా శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 2025–2026 సంవత్సరానికి జరుగుతున్న బీబీఏ ఎన్నికల్లో నామినేషన్లు పరిశీలన అనంతరం ఉపాధ్యక్ష పదవికి పిల్లా శ్రీనివాసరావు ఒక్కరే నామినేషన్ దాఖలు చేశారు. దీంతో ఆయన ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల ప్రధాన అధికారి డి.పి.రామకృష్ణ ప్రకటించారు. ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్ల జాబితాలో 30 సంవత్సరాల పైబడిన సీనియారిటీ విభాగంలో పి.వి.ఏడుకొండలు, రెండు సంవత్సరాల పైబడిన విభాగంలో ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్లుగా 14 మందికి అవకాశం ఉండగా 14 మంది మాత్రమే పోటీచేయడంతో వారందరూ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. గవర్నింగ్ బాడీతోపాటు మిగతా ఎగ్జిక్యూటివ్ మెంబర్లు 10, 20 సంవత్సరాల పైబడిన విభాగంలో యథావిధిగా ఎన్నికలు జరుగుతాయని ఎన్నికల అధికారులు తెలిపారు.

క్యాంపస్ డ్రైవ్‌లో 74 మంది ఎంపిక



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో అడెప్ట్ టాలెంట్ అక్విజేషన్ సంస్థ నిర్వహించిన రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌లో 74 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ శరవణకుమార్ తెలిపారు. కళాశాలలో జరిగిన ఈ డ్రైవ్‌లో రాతపరీక్ష, గ్రూప్ డిస్కషన్, టెక్నికల్ ఇంటర్వ్యూ, హెచ్‌ఆర్ రౌండ్‌లో విద్యార్థులు ప్రతిభ కనబరిచి ఎంపికయ్యారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను కళాశాల కార్యదర్శి చిట్టా అమర్‌సుధీర్ అభినందించినట్లు తెలిపారు.

ఒకేసారి పన్ను బకాయిలు చెల్లిస్తే వడ్డీ రాయితీ

పటమట(విజయవాడతూర్పు): ఆస్తి, నీటి, డ్రైనేజీ, ఖాళీ స్థలాలకు సంబంధించి పేరుకుపోయిన పన్ను బకాయిలను ఈ నెల 31వ తేదీలోపు ఏకమొత్తంలో ఒకేసారి చెల్లిస్తే వడ్డీపై 50 శాతం రాయితీ ఇస్తామని మునిసిపల్ కమిషనర్ ధ్యానచంద్ర మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసిందని పేర్కొన్నారు. దీన్ని పన్నుల చెల్లింపుదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ రాయితీ ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటికే మొత్తం వడ్డీతో కట్టిన వారందరికీ కూడా వర్తిస్తుందని వివరించారు. రాయితీ మొత్తాన్ని వచ్చే ఆర్థిక సంవత్సర పన్నులకు జమ చేస్తామని తెలిపారు. పన్నుల చెల్లింపుదారుల సౌకర్యార్థం వివిధ ప్రాంతాల్లో ఉన్న 13 క్యాష్ కౌంటర్లు, మూడు జోనల్ కార్యాలయాల్లో ఉన్న ఆరు క్యాష్ కౌంటర్లు ఈ నెల 31వ తేదీ వరకు ఉదయం ఎనిమిది నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు పనిచేస్తాయని తెలిపారు. మిగిలిన క్యాష్ కౌంటర్లు యథావిధిగా ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు ప్రజలకు అందుబాటులో ఉంటాని తెలిపారు. కావున ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పటమటలో ట్రాఫిక్ డ్రిల్



పటమట(విజయవాడతూర్పు): బాలలు, యువతకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన అవసరమని ట్రాఫిక్ ఏడీసీపీ ఎ.ఎల్.వి.ప్రసన్న కుమార్ సూచించారు. మంగళవారం పటమట ఎన్టీఆర్ సర్కిల్ వద్ద స్కూలు, కాలేజీ విద్యార్థులతో ఆయన ట్రాఫిక్ డ్రిల్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ట్రాఫిక్‌పై అవగాహన పెరగాలని, హెల్మెట్ ధరించటం, ట్రిపుల్ రైడింగ్ వల్ల జరిగే నష్టాలు, సిగ్నల్స్ పాటించటం, సెల్ఫ్ సిగ్నల్స్ తదితర అంశాలపై డ్రిల్‌లో వివరించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ రామారావు, సిబ్బంది విద్యార్థులతో పాటు ప్లకార్డులు ట్రాఫిక్ నియమాలను వివరించారు.

గొంతెండుతోంది..!

- జక్కంపూడి వైఎస్సార్ కాలనీలో తాగునీటికి కటకట
- కాలనీవాసుల తాగునీటి అవసరాలు తీర్చలేకపోతున్న రిజర్వాయర్
- మరో రిజర్వాయర్ నిర్మాణం శిలాఫలకానికే పరిమితం
- నాలుగు ట్యాంకర్లతో వాడుక అవసరాలకు నీటి సరఫరా



కాలువకు ఒక పక్కన ఉన్న మంచినీటి రిజర్వాయర్

భవానీపురం(విజయవాడపశ్చిమ): తాగునీటికి కటకటలాడుతున్న జక్కంపూడి వైఎస్సార్ కాలనీవాసుల దాహార్తి ఈ ఏడాదైనా తీరేనా అనేది ప్రశ్నార్థకంగానే ఉంది. ఏ ఏడాదికి ఆ ఏడాది ఎదురు చూపులు తప్ప తాగునీటి సమస్య నేటికీ అపరిష్కృతంగానే ఉంది. కాలనీ ఏర్పాటై దశాబ్ద కాలం గడిచినా నేటికీ మంచినీళ్ల కోసం అల్లాడుతున్నారంటే అటు నగరపాలక సంస్థ ఇటు గొల్లపూడి పంచాయతీ అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తుంది. నాటి నుంచి నేటి వరకు కాలనీవాసులు మినరల్ వాటర్ క్యాన్లు కొనుక్కుని దాహార్తి తీర్చుకోవల్సిన దుస్థితి. వాడుక అవసరాలకు సైతం చాలీచాలని నీటితో ఇబ్బందులు పడాల్సి వస్తోంది. కాలనీలో ఎవరిని కదిపినా నీటి కష్టాలను ఏకరవు పెడుతున్నారు. రెండో రిజర్వాయర్ నిర్మాణానికి మైలవరం నియోజకవర్గం అప్పటి ఎమ్మెల్యే దేవినేని ఉమామహేశ్వరరావు వేసిన శిలాఫలకంతో దాహార్తి తీరుతుందా అంటూ కాలనీవాసులు ఎద్దేవా చేస్తున్నారు. కాలనీలో మొత్తం 280 బ్లాకులు ఉండగా ఒక్కో బ్లాక్‌లో 32 ఫ్లాట్లు ఉన్నాయి. ఫ్లాట్‌కు కనీసం నలుగురు చొప్పున లెక్కేసుకున్నా మొత్తం మీద సుమారుగా 35 వేల మందికి పైగానే ఇక్కడ నివసిస్తున్నారు. కాలనీ మొత్తం మీద 1500 కేఎల్ సామర్థ్యంతో ఒక రిజర్వాయర్ మాత్రమే ఉంది. ఇది కాలనీకి ఒక వైపు ఉండగా అటు పక్కన ఉండే బ్లాకుల్లోని ప్రజలకు మాత్రమే వాడకం నీరు అందుతుంది. అదీ పూర్తి స్థాయిలో అందదు. ఇక కాలనీకి మరో వైపు బ్లాకుల్లో నివసించే ప్రజలు నీటి ట్యాంకర్ల కోసం ఎదురు చూపులు చూడాల్సిన దుస్థితి నెలకొంది. కొన్ని బ్లాకుల్లో సుమారు 20 వరకు బోర్లు ఉండగా వాటి ద్వారా వచ్చే నీటిని వాడకానికి మాత్రం వాడుకుంటున్నారు.

రెండో రిజర్వాయర్ నిర్మాణం శిలాఫలకానికే పరిమితం

కాలనీవాసుల నీటి కొరత తీర్చేందుకు ప్రధాన మౌలిక వసతుల అభివృద్ధి ప్రణాళిక (సీఐడీపీ) నిధులు రూ.523 లక్షల వ్యయంతో 1500 కేఎల్ సామర్థ్యంతో రెండో రిజర్వాయర్ నిర్మిస్తానని దేవినేని ఉమామహేశ్వరరావు జలవనరుల శాఖ మంత్రిగా ఉన్న సమయంలో 2019 ఎన్నికలకు ముందు శిలాఫలకం వేసి చేతులు దులుపుకొన్నారు. ఎన్నికలకు ముందు తమను మభ్యపెట్టి ఓట్లు వేయించుకునేందుకే హడావుడిగా శంకుస్థాపన చేశారని, ఆ తరువాత దాని గురించి పట్టించుకోలేదని స్థానికులు దుమ్మెత్తి పోస్తున్నారు. అప్పట్లో ఆయన సొంత నియోజకవర్గంలోనే తాగు నీటి కొరత ఉండటానికి ఆయన అసమర్థతే కారణమని కాలనీవాసులు గుర్తు చేసుకుంటున్నారు. ఇప్పుడు ఆయన స్థానంలో గొల్లపూడి గ్రామానికి చెందిన మరో టీడీపీ నాయకుడు కాలనీలో చక్రం తిప్పుతున్నా తాగునీటి గురించి మాత్రం పట్టించుకోవడం లేదని మండిపడుతున్నారు.

నాలుగు ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా

నగరపాలక సంస్థ రోజూ నాలుగు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తోంది. రోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు నాలుగు వాటర్ ట్యాంకర్లు తిరుగుతూనే ఉంటాయి. ప్రతి బ్లాకులో ఉన్న వాటర్ సంప్‌లోకి ఆ నీటిని డంప్ చేస్తారు. ఒక్కో సంప్ నిండాలంటే కనీసం రెండున్నర ట్యాంకర్లు అవసరం అవుతాయి. సంప్ నిండిన తరువాత మోటరు వేస్తే ఆ బ్లాక్ టెర్రస్‌పై ఉన్న ఓవర్ హెడ్ ట్యాంకుల్లోకి వెళతాయి. ఆ నీటిని బ్లాకులో ఉండే 32 ఫ్లాట్లలో నివసించేవారు వాడుకోవాల్సి ఉంటుంది. మోటారు వేసినప్పుడు వచ్చే కరెంట్ బిల్లు ఆయా ఫ్లాట్లలో ఉండేవారు చెల్లించాల్సి ఉంటుంది. వాస్తవానికి ట్యాంకర్ల ద్వారా వచ్చేవి మంచినీరే అయినా సంప్‌లోకి వచ్చేసరికి తాగేందుకు పనికిరావు. ప్రస్తుతం ఉన్న రిజర్వాయర్ నుంచి కూడా సంప్‌ల్లోకి నీళ్లను పంపింగ్ చేస్తున్నారు. తాగేందుకు మాత్రం మినరల్ వాటర్ ప్లాంట్ల నుంచి క్యాన్లు కొనుగోలు చేయాల్సిందే.



వీఎంసీ వాటర్ ట్యాంకర్ల ద్వారా సంప్‌ల్లో నింపుతున్న నీళ్లు

శాశ్వత పరిష్కారం కావాలి



కాలనీలో నివసించేది పేద, మధ్య తరగతి ప్రజలే. ఇక్కడ అధిక శాతం మంది పొద్దున లేస్తే కూలి పనులు, చిరుద్యోగాలు చేసుకునేందుకు వెళ్లిపోయే వారే. పనికి వెళ్లే ముందు ప్లాంట్‌కు వెళ్లి మినరల్ వాటర్ క్యాన్లు ఇంట్లో పడేసి వెళ్లాల్సిందే. ఇంటికి చుట్టాలు వచ్చినా, ఫంక్షన్లు ఉన్నా నీటి సమస్య చెప్పనలవి కాదు. మంచి నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి. కాలనీలో రెండో రిజర్వాయర్ నిర్మిస్తానని శంకుస్థాపన చేసిన దేవినేని ఉమా ఏమైపోయాడో తెలియదు.

– కొరగంజి సత్యనారాయణ, గొల్లపూడి 9వ సెగ్మెంట్ ఎంపీటీసీ.

ఎవరూ పట్టించుకోకపోతే మా గతేంటి?



ఇంటికి ఎవరైనా వస్తే గుక్కెడు మంచి నీళ్లు ఇవ్వలేని దుస్థితి నెలకొంది. వాడకం నీటికే అనేక ఇబ్బందులు ఎదుర్కోవల్సి వస్తుంది. మున్సిపల్ కార్పొరేషన్ పుణ్యమా అంటూ వాడకం అవసరాలకు నీరు వస్తున్నా సంప్ నుంచి పైకి ఎక్కేందుకు ఉపయోగించే మోటార్ కరెంట్ బిల్లు మేమే చెల్లించాలి. సంప్‌లో నీళ్లకూడా 32 ఫ్లాట్లలో నివసించేవారికి పూర్తి స్థాయిలో సరిపోవు. అయినా సర్దుకు పోతున్నాం. తిన్నా తినకపోయినా మంచినీళ్లయినా ఉండాలి కదా. వీఎమ్‌సీ, పంచాయితీ అధికారులు ఎవరూ పట్టించుకోకపోతే మా గతేంటి?

– నక్కా ప్రభుదాస్, కాలనీవాసి.

ఆలపాటి సత్యనారాయణ మూర్తికి నివాళులు



ఆలపాటి సత్యనారాయణ మూర్తి (ఫైల్)

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): గోల్డ్ స్పాట్ సత్యనారాయణమూర్తిగా ప్రసిద్ధి చెందిన ఆలపాటి సత్యనారాయణ మూర్తి (80) హృదయ సంబంధిత వ్యాధితో కొంతకాలంగా హైదరాబాద్ ఏఐజీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి సోమవారం కన్నుమూశారు. ఆయన భౌతికకాయాన్ని విజయవాడ సూర్యారావుపేట నరసింహారావు నాయుడు వీధిలోని స్వగృహానికి మంగళవారం తీసుకొచ్చారు. నగరంలోని వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, రాజకీయ నాయకులు ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. సత్యనారాయణమూర్తికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ది విజయవాడ బాట్లింగ్ కంపెనీని విజయవాడలో ప్రారంభించి గోల్డ్‌స్పాట్, లిమ్కా తదితర శీతల పానీయాలు, బిస్లరీ సోడాలను కృష్ణాజిల్లా వ్యాప్తంగా పంపిణీ చేసేవారు. సిద్ధార్థ అకాడమీ పాలకవర్గ సభ్యుడిగా, విజయవాడ క్లబ్, విజయవాడ వాకర్స్ అసోసియేషన్‌లో జీవిత కాల సభ్యుడిగా సత్యనారాయణమూర్తి సేవలందించారు. పేద విద్యార్థుల చదువులకు ఆర్థిక సాయం చేయడంలోనూ ఆయన ముందుండేవారు. మంగళవారం మధ్యాహ్నం సత్యనారాయణ మూర్తి అంతిమ యాత్ర, కృష్ణలంకలోని స్వర్గపురిలో అంత్యక్రియలు జరిగాయి.

శ్రీనివాసునికి పంచామృత అభిషేకాలు



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఏకాదశి, శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని చిట్టినగర్‌లోని శ్రీ పద్మావతి, గోదాదేవి సమేత శ్రీవెంకటేశ్వరస్వామి వారి సన్నిధిలో మంగళవారం స్వామివారికి పంచామృత అభిషేకాలు, విశేష అర్చనలు నిర్వహించారు. ఉదయం ఆరు గంటలకు స్వామివారి మూలవిరాట్‌కు ఆలయ ప్రధాన అర్చకులు రామరత్నమాచార్యులు విశేష అభిషేకాలు చేశారు. అనంతరం స్వామివారికి విశేష అలంకరణ, తులసీ దళ అర్చనలు నిర్వహించారు. పెద్ద ఎత్తున ఉభయదాతలు, భక్తులు తమ నామగోత్రాలతో పూజలు జరిపించుకున్నారు. పూజా కార్యక్రమాల అనంతరం స్వామివారికి పంచహారతుల సేవ జరిగింది. పెద్ద ఎత్తున భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

మహిళల రక్షణ కోసం సహాయ డెస్క్



అవగాహన కల్పిస్తున్న మాచవరం పోలీసులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మహిళలు, పిల్లల భద్రత కోసం మహిళల సహాయ డెస్క్‌ను ఏర్పాటు చేశామని, ఈ డెస్క్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఉమెన్ పోలీస్ వై.సోమమ్మ సూచించారు. స్థానిక మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్‌సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం మహిళల సహాయ డెస్క్‌పై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సోమమ్మ మాట్లాడుతూ.. మహిళలు, పిల్లలపై జరిగే అన్ని నేరాలకు సహాయ డెస్క్‌లో ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. ఆపదలో ఉన్నప్పుడు 112, 181, 1930, 1098కు కాల్ చేయటం ద్వారా తక్షణసహాయం పొందొచ్చన్నారు. ప్రతీ ఒక్కరూ పోలీసు సేవలను గురించి తెలుసుకోవటంతో పాటు వాటిని అవసరమైన సమయంలో ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు అడిగిన సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో పి.రమేష్ బాబు, డి.యుగంధర్, కె.రమేష్ సుధాకర్, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

డంపర్ బిన్‌లను సరిచేయరూ..

మధురానగర్(విజయవాడసెంట్రల్): నగరంలో స్వచ్ఛ సర్వేక్షణ్ అంటూ ఒక పక్క అధికారులు ఆర్భాటం చేస్తున్నారు. మరో పక్క పారిశుద్ధ్య సిబ్బంది నిర్లక్ష్యం వల్ల పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి. 31వ డివిజన్ అంబేడ్కర్ కాలనీ శ్మశానం సమీపంలో యూజీడీ మరమ్మతుల్లో భాగంగా రోడ్డును తవ్వారు. ఈ క్రమంలో ఇక్కడ ఏర్పాటు చేసిన డంపర్ బిన్‌లు బయటకు వచ్చాయి. వాటిని కనీసం మరో చోట ఏర్పాటు చేయటం లేదా అక్కడే వాటిని నిలబెట్టి చెత్తవేసేలా చర్యలు తీసుకోలేదు. ఇక్కడ డంపర్‌బిన్‌లు సక్రమంగా లేకపోవటంతో స్థానికులు చెత్తచెదారాన్ని పక్కనే ఉన్న ఏలూరు కాలువ, మురుగు కాలవల్లో పడేస్తున్నారు. అధికారులు స్పందించి డంపర్‌బిన్‌లను సరిచేయాలని కోరుతున్నారు.

కళాకారుల సంక్షేమానికి కృషి చేయాలి



కళాకారుల సమావేశంలో పాల్గొన్న వివిధ సంస్థల ప్రతినిధులు

విజయవాడ కల్చరల్: కళాకారుల సంక్షేమానికి సాంస్కృతిక సంస్థలు కృషి చేయాలని శ్రీ కళాభారతి వ్యవస్థాపకుడు శింగంశెట్టి చంద్రశేఖర్ కోరారు. కళాకారుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని సంస్థ కార్యాలయంలో మంగళవారం నగర కళాకారుల ఆత్మీయ సమావేశం, భవిష్యత్ కార్యాచరణపై చర్చ జరిగాయి. కామ్రేడ్ జీఆర్‌కే పోలవరపు సాహితీ సమితి వ్యవస్థాపకుడు గోళ్ల నారాయణరావు మాట్లాడుతూ.. విలువలతో కూడిన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ సంస్థల ప్రతినిధులు కె.డేవిడ్‌రాజు, బి.వి.వీరభద్రరావు, ప్రిన్స్, డాక్టర్ వెన్నా వల్లభరావు, డాక్టర్ గుమ్మా సాంబశివరావు, అమ్ముల ప్రసాద్ పాల్గొన్నారు.

మత సామరస్యానికి నిదర్శనం ఇఫ్తార్ విందు

వైఎస్సార్ సీపీ పశ్చిమ ఇన్‌చార్జ్ వెలంపల్లి



ఇఫ్తార్ విందుకు ముందు ప్రార్థన చేస్తున్న వెలంపల్లి, రెహమాన్, ఇర్ఫాన్, గౌస్ మొహిద్దీన్

భవానీపురం(విజయవాడపశ్చిమ)/గాంధీనగర్(విజయవాడసెంట్రల్): కులమతాలకు అతీతంగా పవిత్ర రంజాన్ మాసంలో ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందు మత సామరస్యానికి నిదర్శనమని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు, పశ్చిమ నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జ్ వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని వైఎస్సార్ సీపీ మైనార్టీ నాయకులు అబ్దుల్ రెహమాన్ (దిల్‌దార్) ఆధ్వర్యంలో భవానీపురంలోని హజరత్ సయ్యద్ గాలిబ్ షహీద్ దర్గా వద్ద మంగళవారం సాయంత్రం ఇఫ్తార్ విందు కార్యక్రమం జరిగింది. తొలుత వెలంపల్లి వైఎస్సార్ సీపీ నాయకులు, స్థానిక ముస్లిం మైనార్టీలతో కలిసి దర్గాలోని బాబా సమాధి వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఇఫ్తార్ విందును వడ్డించారు. ఈ సందర్భంగా వెలంపల్లి మాట్లాడుతూ ఈ రంజాన్ మాసమంతా కఠోర దీక్ష అవలంబించటం వలన అటు ఆధ్యాత్మికం ఇటు ఆరోగ్యం, క్రమశిక్షణ కలుగుతుందని అన్నారు. మహమ్మద్ ప్రవక్త బోధనలను అనుసరించాలని, తోటివారికి సాయం చేస్తూ సన్మార్గంలో పయనించాలని కోరారు. రాష్ట్ర ప్రజలందరిపై అల్లాహ్ ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో 41వ డివిజన్ వైఎస్సార్ సీపీ కార్పొరేటర్ ఎండీ ఇర్ఫాన్, వక్ఫ్‌బోర్డ్ డైరెక్టర్ షేక్ ఖాజా, జిల్లా వక్ఫ్‌బోర్డ్ మాజీ చైర్మన్ షేక్ గౌస్ మొహిద్దీన్, వైఎస్సార్ సీపీ జిల్లా మైనార్టీ అధ్యక్షుడు షేక్ మస్తాన్, దర్గా ముజావర్ల కమిటీ అధ్యక్షుడు ముస్తాక్ అహ్మద్, పార్టీ నాయకులు అబ్దుల్ సత్తార్, మహ్మద్ అల్తాఫ్, ఎండీ ఇషాక్, బద్రుద్దీన్, అబ్దుల్ ఖయ్యూమ్, మొహిద్దీన్, నసీమ్, ఇలియాస్, బడే మియా, మహ్మద్ గౌస్, యూనస్, గోరు సలీం తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన లోపంతోనే నేరాలు

చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ రాజశేఖర్



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జడ్జి రాజశేఖర్

భవానీపురం(విజయవాడపశ్చిమ): చదువు లేకపోవడం, చట్టాలపై పూర్తి అవగాహన లోపించడంతోనే అమాయకులు నేరస్తులుగా మారుతున్నారని చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ రాజశేఖర్ అన్నారు. విజయవాడ రూరల్ మండలం జక్కంపూడి వైఎస్సార్ కాలనీలోని కమ్యూనిటీ హాల్‌లో మంగళవారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పోక్సో, సైబర్ నేరాలు, బాల్య వివాహాల చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైకోర్ట్ ఉత్తర్వుల మేరకు ప్రతి న్యాయస్థానం పరిధిలో విజ్ఞాన సదస్సులు నిర్వహించి చట్టాలపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. పోక్సో చట్టంలో 18 సంవత్సరాల లోపు పిల్లలను లైంగికంగా వేధిస్తే కఠిన శిక్షలు ఉంటాయని తెలిపారు. 18 ఏళ్లు నిండిన ఆడపిల్లలు ఇష్టపడి చేసినా అది పోక్సో చట్టం ప్రకారం నేరమే అవుతుందని స్పష్టం చేశారు. మహిళలపై ఎలాంటి అఘాయిత్యాలకు పాల్పడినా కఠినంగా శిక్షలు ఉంటాయని అన్నారు. బాల్య వివాహాలు చేయకూడదని, అటువంటి సంఘటనలు ఎక్కడైనా జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే శిశు సంక్షేమ శాఖ లేదా పోలీస్ అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. పెరుగుతున్న సాంకేతిక విజ్ఞానాన్ని ఆసరాగా తీసుకుని కొందరు సైబర్ నేరాలకు పాల్పడుతున్నారని, అటువంటి సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. మొబైల్ ఫోన్ అవసరం మేరకే వాడుకోవాలని, దుర్వినియోగం చేస్తే సైబర్ నేరగాళ్ల మోసానికి బలి కావల్సి వస్తుందని అన్నారు. సదస్సులో వెస్ట్ జోన్ ఏసీపీ ఎన్ఎస్‌వీకే దుర్గారావు, కొత్తపేట సీఐ చిన కొండలరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

భవానీపురం(విజయవాడపశ్చిమ): మైలతుత్తం అనే రసాయనం తాగి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మంగళవారం మృతి చెందాడు. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బైపిళ్ల చిట్టిబాబు (45) కొత్తపేట శ్రీనివాస మహల్ వద్ద పితాని అప్పలస్వామి వీధిలో కుటుంబసభ్యులతో కలిసి నివసిస్తున్నాడు. మార్బుల్ పని చేసే అతను మద్యానికి బానిసై అక్కడక్కడ అప్పులు చేస్తూ ఇంటి గురించి పట్టించుకోకుండా ఉండేవాడు. ఈ క్రమంలో చిట్టిబాబు ఈ నెల 20వ తేదీ రాత్రి 7.30 గంటల సమయంలో ఇంటి దగ్గరలో గల ఒక సందులో రోడ్డు పక్కన పడిపోయి ఉండటం చూసి సాయి అనే వ్యక్తి చిట్టిబాబు కుమారుడు దినేష్‌కు ఫోన్ చేసి చెప్పాడు. వెంటనే దినేష్ అక్కడకు వచ్చి ఆటోలో మంగళగిరిలోని ఎయిమ్స్ హాస్పిటల్‌లో జాయిన్ చేశాడు. అక్కడ చిట్టిబాబు వాంతులు చేసుకోవడంతో డాక్టర్ వచ్చి మైలతుత్తం తాగినట్లున్నాడని, పరిస్థితి విషమంగా ఉందని చెప్పారు. మెరుగైన వైద్యం నిమిత్తం చిట్టిబాబును మంగళవారం తెల్లవారు జామున విజయవాడ జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మధ్యాహ్నం 3.15 గంటల సమయంలో చనిపోయినట్లు డ్యూటీ డాక్టర్ నిర్ధారించారు. మద్యానికి బానిసై ఆర్థిక ఇబ్బందుల కారణంగా మైలతుత్తం ద్రావణం తాగి చనిపోయాడని కుమారుడు దినేష్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పోక్సో చట్టంపై అవగాహన అవసరం



ప్రసంగిస్తున్న మేజిస్ట్రేట్ రమణారెడ్డి

మధురానగర్(విజయవాడసెంట్రల్)/విజయవాడ లీగల్: పోక్సో చట్టంపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని నాలుగో అదనపు సీనియర్ సివిల్ జడ్జికం ఐదో అదనపు చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ సి.రమణారెడ్డి అన్నారు. అజిత్‌సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని న్యూ రాజరాజేశ్వరిపేటలో మంగళవారం మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యాన న్యాయవిజ్ఞాన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో జడ్జి రమణారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ప్రజలకు రక్షణ కల్పించేందుకు అనేక చట్టాలు ఉన్నాయని తెలిపారు. ఈ చట్టాలపై కనీస అవగాహన కలిగి ఉండాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ఎప్పటికప్పుడు కనిపెట్టుకొని ఉండాలని సూచించారు. ఎవరైనా చిన్న పిల్లలపై లైంగికంగా అఘాయిత్యాలు, అకృత్యాలకు పాల్పడితే చట్టప్రకారం వారిని కఠినంగా శిక్షిస్తామని స్పష్టంచేశారు. బాధితుల్లో మనోధైర్యం నింపడానికి, సమాజంలో నిలదొక్కుకునేందుకు ప్రభుత్వపరంగా పరిహారం అందుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో అజిత్‌సింగ్‌నగర్ సీఐ బీహెచ్ వెంకటేశ్వర్లు, ఎస్ఐ కె.రమ్యశ్రీ, మండల న్యాయసేవాధికార సంస్థ ప్యానల్ అడ్వకేట్ కంచర్ల త్రినాథ్‌కుమార్, పి.ఎల్.వి. సాల్మన్ జయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో వంశీ అనుచరుడు రంగా

గన్నవరం: మాజీ ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ అనుచరుడైన ఓలుపల్లి మోహన్‌రంగాను మంగళవారం గన్నవరం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వివరాలిలా ఉన్నాయి.. రెండేళ్ల క్రితం గన్నవరం టీడీపీ ఆఫీస్‌పై జరిగిన దాడి కేసులో రంగాను పోలీసులు ఏ1 నిందితుడిగా చేర్చారు. అనంతరం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కక్ష సాధింపు చర్యల్లో భాగంగా మాజీ వంశీమోహన్‌తో పాటు ఆయన అనుచరుడైన రంగాను ప్రధానంగా టార్గెట్ చేశారు. టీడీపీ ఆఫీస్‌పై దాడి కేసులో ఫిర్యాదుదారుడైన సత్యవర్ధన్‌ను కిడ్నాప్‌కు పాల్పడ్డారంటూ పటమట పీఎస్‌లో కేసు, గన్నవరం పీఎస్‌లో నాలుగు, ఆత్కూరు, వీరవల్లి పీఎస్‌ల్లో ఒక్కొక్క కేసు చొప్పున కొత్తగా రంగాపై కేసులు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో అజ్ఞాతంలోకి వెళ్లిన రంగాను రాజమండ్రి వద్ద పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. అనంతరం ఆయనను గన్నవరం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. డీఎస్పీ సీహెచ్ శ్రీనివాసరావు నేతృత్వంలో పోలీస్ అధికారులు రంగాను విచారిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే పోలీస్‌స్టేషన్‌లో ఉన్న రంగాను కలిసేందుకు ఆయన కుటుంబ సభ్యులతో పాటు న్యాయవాదులను కూడా పోలీసులు అనుమతించలేదు. పోలీసుల తీరుపై కుటుంబ సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.





కల్యాణం.. కమనీయం

లబ్బీపేట శారదా చంద్రమౌళీశ్వర స్వామి దేవస్థానంలో మంగళవారం పద్మావతి, శ్రీనివాసుల కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. ఈ వేడుకను శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. 50 రకాల పుష్పాలు, తులసి మాలలతో స్వామిని అర్చించారు. ఈ వేడుకను భక్తులు కనులారా తిలకించి పులకించారు.

– విజయవాడ కల్చరల్